క్లుప్తంగా

మంత్రి నవ చండీయాగం


పూజలు చేస్తున్న మంత్రి దంపతులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కుటుంబ సమేతంగా నవ చండిసహిత రాజశ్యామల యాగం నిర్వహించారు. యాగంలో వేద పండితుల మంత్రోచ్ఛరణాల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. నిర్మల్ ప్రజల శ్రేయస్సు కోసం ఈ యాగం నిర్వహించినట్లు మంత్రి పేర్కొన్నారు. ఇందులో మంత్రి సతీమణి విజయలక్ష్మి, కోడలు - కుమారుడు అల్లోల దివ్య -గౌతమ్ రెడ్డి, కూతురు-అల్లుడు పల్లవి -రంజిత్‌రెడ్డి, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

సోన్: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం మంత్రి ఐకేరెడ్డి పర్యటిస్తారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోహినొద్దీన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు న్యూవెల్మల్‌లో, తొమ్మిది గంటలకు సంఘంపేట్‌లో, 10 గంటలకు బొప్పారంలో, 11 గంటలకు కూచన్‌పెల్లిలో, మధ్యాహ్నం 1:30 గంటలకు సాకెర గ్రామంలో, 2:30 గంటలకు కడ్తాల్‌లో, 3:30 గంటలకు గంజాల్‌లో, సాయంత్రం 4:30 గంటలకు సోన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని.. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఆయన కోరారు.

కరాటే శిక్షణ తరగతులు ప్రారంభం

ఖానాపూర్: మండలంలోని పాతఎల్లాపూర్ జెడ్పీఎస్ఎస్‌లో సోమవారం విద్యార్థినులకు ఉచితంగా కరాటే శిక్షణ తరగతులను హెచ్ఎం రమాదేవి ప్రారంభించారు. కరాటే సాధనతో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని.. విద్యార్థులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కరాటే శిక్షకుడు మనోహర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

టపాసుల దుకాణాలకు లైసెన్సు తప్పనిసరి


తనిఖీలు చేస్తున్న ఎస్సై రాజు

కడెం: టపాసుల వ్యాపారం చేసేవారు తప్పనిసరిగా లైసెన్సు కల్గి ఉండాలని ఎస్సై రాజు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పలు టపాసుల దుకాణాలను ఎస్సై తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యాపారులకు పలు సూచనలు చేశారు. ఇందులో సిబ్బంది వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై భీంరావు

కడెం: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఏఎస్సై భీంరావు అన్నారు. సోమవారం మండలంలోని కన్నాపూర్ గ్రామంలో ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా ధ్రువపత్రాలను కల్గి ఉండాలని సూచించారు. అపరిచితులు ఫోన్ చేస్తే ఓటీపీ, బ్యాంక్, వ్యక్తిగత వివరాలను చెప్పవద్దని పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌కు నిరసన సెగ


నాయకులతో మాట్లాడుతున్న గ్రామస్తులు

తానూరు: మండలంలోని మొగ్లి గ్రామంలో సోమవారం బీఆర్ఎస్ నాయకుల ప్రచారాన్ని కొందరు గ్రామస్తులు అడ్డుకున్నారు. ఇప్పటివరకు తమ గ్రామంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని.. బీఆర్ఎస్ ప్రభుత్వం తమకేం చేసింది లేదని వాపోయారు. ఇప్పటికీ రుణమాఫీ కాలేదని.. కేవలం ఎన్నికల వేళ మాత్రమే తాము గుర్తుకు వస్తామా? అని నిలదీశారు. దీంతో బీఆర్ఎస్ కార్యకర్తలు, ఓటర్లకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. చేసేదేం లేక బీఆర్ఎస్ కార్యకర్తలు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

దెబ్బతింటున్న పంటలు

- నెల రోజులకు పైగా జాడలేని వర్షాలు
- దిక్కు తోచని స్థితిలో పత్తి రైతులు
- పెట్టుబడులూ వచ్చేలా లేవని ఆవేదన
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు


కుభీర్ శివారులో పంట దుస్థితి


బెల్లాం శివారులో ఎండిపోతున్న పత్తిపంట

కుభీర్: అహర్నిశలు కష్టపడి అందరికీ అన్నం పెట్టే రైతులకు కష్టాలు తప్పడం లేదు. నెలరోజులకు పైగా వర్షాల్లేకపోవడంతో ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు ఎండుతున్నాయి. దీంతో ఏం చేయాలో తోచక అన్నదాతలు అల్లాడుతున్నారు. అప్పులు తెచ్చి పెట్టిన పెట్టుబడులూ వచ్చేలా లేవని.. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

మండలంలో 27వేల ఎకరాల్లో సాగు..

కుభీర్ మండలంలో ఖరీఫ్‌లో 27వేల ఎకరాల్లో రైతులు పత్తి పంటలు సాగు చేశారు. కానీ నీటి వసతి లేకపోవడం, నెలరోజులకు పైగా వర్షాల్లేకపోవడంతో గ్రామాల్లో పత్తి పంట ఘోరంగా దెబ్బతింది. ఖాత, పూత దశకు చేరిన పంటలకు నీరు అందక ఎండిపోతున్నాయి. ఒక మొక్కకు రెండు, మూడు కాయలు మాత్రమే ఉంటున్నాయి. పత్తి దీనస్థితిని చూసిన కొందరు మొక్కలను తొలగించి.. మొక్కజొన్న, శనగ విత్తనాలను విత్తుతున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిస్తే నవంబర్ నుంచి ఏప్రిల్ వరకు పత్తి ఏరే సీజన్ ఉంటుంది. కానీ ప్రస్తుతం డిసెంబర్ నెలలోనే పత్తి సీజన్ ముగిసేలా ఉంది. మండలంలో గిరిజన తండాలైన సిర్పెల్లి, రంజని, దొడర్నా, చెల్లాం, మార్లగొండ, శివుని, కుభీర్‌లో కొండ ప్రాంతాలున్న చోట పత్తి సాగు చేశారు. అక్కడా నీరు లేక పంటలు ఎండుతున్నాయి.

వర్షాల్లేక ఆలస్యం..

జూన్‌లో వర్షాల్లేకపోవడంతో ఆలస్యంగా జులై మాసంలో పత్తి విత్తనాలు విత్తారు. తర్వాత ఆగష్టులో నామమాత్రంగానే వర్షాలు కురిశాయి. సెప్టెంబర్‌లో భారీ వర్షాలు కురిశాయి. కీలకమైన అక్టోబర్‌లో పూత, కాతకు చేరిన పత్తి పంటలో వర్షాలు కురువలేదు. భూమిలో తేమశాతం లేక పత్తి, ఇతర పంటలు ఎండుతున్నాయని రైతులు వాపోతున్నారు.

పెరిగిన పెట్టుబడులు..

ఇప్పటికే దున్నడం, విత్తనాలు, ఎరువులు, కలుపు తీయడం, క్రిమిసంహారక మందుల పిచికారీ, పత్తి సేకరణకు కూలీలకయ్యే ఖర్చు తడిసి మోపెడు అయిందని రైతులు పేర్కొంటున్నారు. కనీసం సాగు ఖర్చులు సైతం వచ్చేలా లేవని.. అధికారులు సర్వే చేసి రైతులకు నష్టపరిహారంతోపాటు, గిట్టుబాటు ధరలు అందేలా చూడాలని వేడుకుంటున్నారు.

దిగుబడి, గిట్టుబాటు లేదు..

గతేడాది పత్తి క్వింటాల్‌కు రూ.8వేల నుంచి రూ.10వేల వరకు ధర పలికితే ఈ సంవత్సరం రూ.ఏడు వేల నుంచి రూ.7,500 వరకు ఉంది. సోమవారం కుభీర్ వ్యవసాయ మార్కెట్‌లో ధర రూ.7200 పలికింది. ఈసారి ఎకరాకు దిగుబడి రెండు క్వింటాళ్లకు మించి రావడం లేదు. ఇప్పటికే సోయా పంటకు పసుపు రోగం రావడంతో పెట్టుబడులు నష్టపోయారు. ఈసారి పత్తి పంట కూడా అలానే ఉండటంతో రైతులు లబోదిబోమంటున్నారు.

రెండెకరాల్లో మూడు క్వింటాళ్లే..



రెండెకరాల్లో పత్తి పంట సాగు చేశా. కాసిన కొద్దిపాటి కాయలకు కేవలం మూడు క్వింటాళ్ల పత్తి వచ్చింది. క్వింటాలుకు రూ.ఏడు వేల చొప్పున అమ్ముకున్నా. పత్తి పంటను తొలగించి ప్రస్తుతం మొక్కజొన్న సాగు చేశా.

– లక్ష్మణ్, బెల్గాంతండా

ప్రభుత్వం ఆదుకోవాలి



ఏడెకరాల్లో పత్తి పంట సాగు చేశా. కేవలం 10 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. పెట్టుబడులకు సుమారు రూ.లక్ష వరకు ఖర్చు చేశా. పెట్టిన ఖర్చే వచ్చేలా లేదు. ప్రభుత్వం స్పందించి పత్తి రైతులను ఆదుకోవాలి.

– చవాన్ రామచంద్ర, రాంనాయక్ తండా

వర్షాల్లేకనే సమస్య

ప్రారంభంలో వర్షాల్లేకపోవడంతో పత్తి పంటను ఈ సంవత్సరం ఆలస్యంగా సాగు చేశారు. కీలకమైన పూత, కాత దశలో వర్షం పడలేదు. దాంతో పంట ఎర్రబడి ఆకులు రాలిపోయి ఉంది. నీళ్లుపెట్టిన రైతుల పంట కొంతవరకు బాగానే ఉంది.

– వికార్ హైమద్, ఏవో, కుభీర్

వేధిస్తే ఫిర్యాదు చేయండి



విద్యార్థులతో షీటీం సిబ్బంది

నిర్మల్‌టౌన్: ఆకతాయిలు వేధిస్తే ఆందోళన చెందకుండా ఎమర్జెన్సీ నెంబర్ 87126 59550కు ఫోన్ చేయాలని షీటీం ఇన్‌చార్జి ఎస్సై సుమాంజలి పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సోఫీనగర్ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో విద్యార్థినులకు షీటీం బృందం ఆధ్వర్యంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. 100కు డయల్, సీసీ కెమెరాలతో లాభాలు, బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, కమ్యూనిటీ పోలీసింగ్, మానవ అక్రమ రవాణా, మద్యపాన నిషేధం, ఆన్‌లైన్ మోసాలు, గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేధం, టోల్ ఫ్రీ నెంబర్ 1930 వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఇందులో ఉపాధ్యాయులు, విద్యార్థులు, షీటీం సిబ్బంది ఉన్నారు.

గమ్యం యాప్‌పై అవగాహన

కుంటాల: ఆర్టీసీ ప్రయాణికులు ఇబ్బంది పడకుండా బస్సుల వివరాలు తెలుసుకునేందుకు గమ్యం యాప్ రూపొందించినట్లు విలేజ్ బస్ ఆఫీసర్ గుడ్డేటి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం కుంటాలలో టీఎస్ఆర్టీసీ రూపొందించిన గమ్యం యాప్‌పై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. తమ స్మార్ట్‌ఫోన్‌లో గమ్యం యాప్ డౌన్‌లోడ్ చేసుకొని బస్సులు ఎక్కడున్నాయో తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. శుభకార్యాలకు, తీర్థయాత్రలకు వెళ్లేందుకు బస్సులను అద్దెకు ఇస్తున్నామని.. అవసరం ఉన్నవారు ఆర్టీసీ అధికారులను సంప్రదించాలని వెల్లడించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ చైర్మన్ జుట్టు లక్ష్మణ్, పలువురు ప్రయాణికులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్‌లో ‘దీపావళి మహోత్సవ్’


చిన్నారులతో చైర్మన్ నరేందర్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్ అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో సోమవారం ‘దీపావళి మహోత్సవ్’ ఘనంగా నిర్వహించారు. అల్ఫో ర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి హాజరై జ్యోతి వెలిగించి మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దీపావళి పండుగ ప్రతి ఇంట్లో వెలుగులు నింపుతుందన్నారు. వ్యాపారులు, ఇతరులు పూజ కార్యక్రమాలు చేసి అమ్మవారి కృప పొందుతారని పేర్కొన్నారు. పర్యావరణానికి హాని కల్గించే టపాసులు కాల్చవద్దని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ×శ్రీ కృష్ణార్జునయుద్ధం×ఆనంద హేలి దీపావళి అంటూ చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం టపాసులను నిర్మూలిద్దాం-కాలుష్యాన్ని నివారిద్దాం.. ప్రకృతిని కాపాడుదాం అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు కిరణ్‌కుమార్ రాజీనామా

భైంసాటౌన్: కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఇటీవల ఆ పార్టీలో చేరిన డాక్టర్ కిరణ్ కొమ్రేవార్ తెలిపారు. భైంసాలోని ఆయన నివాసంలో సోమవారం మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం తనకే టికెట్ ఇస్తామని చెప్పి మూడునెలలుగా నియోజకవర్గంలో పని చేయించుకుని, వేరే అభ్యర్థికి టికెట్ కేటాయించి తనకు అన్యాయం చేసిందని ఆరోపించారు. అందుకే పార్టీ వీడుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట నాయకులు దేవీదాస్, ముత్యం తదితరులు ఉన్నారు.

పథకాలను చూసే బీఆర్ఎస్‌లో చేరిక

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి


బీఆర్ఎస్‌లో చేరిన వారితో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

సోన్: సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను చూసే బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఆ పార్టీ నిర్మల్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మదాపూర్ గ్రామానికి చెందిన 100 మంది యువకులు నిర్మల్‌లోని మంత్రి నివాసంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ మేరకు ఆయన వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వి.సత్యనారాయణగౌడ్, సోన్ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మోహినొద్దీన్, ఆనంద్‌రెడ్డి, రాజేశ్వర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రచారం

సోన్: నిర్మల్ ఎమ్మెల్యేగా ఇంద్రకరణ్‌రెడ్డిని గెలిపించాలని మండలంలోని న్యూవెల్మల్, సోన్ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సంక్షేమ పథకాలను వివరించారు. సోన్ గ్రామాధ్యక్షుడు గంగాధర్, నాయకులు గంగాధర్, రాజేశ్వర్, తోట సాయన్న, భూమేశ్, కిరణ్‌రావు, ప్రశాంత్, హరీశ్, నర్సయ్య, వేణు, సురేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రామారావ్‌పటేల్‌ను గెలిపించాలని ప్రచారం


బామ్ని(కే)లో నినాదాలు చేస్తున్న బీజేపీ నాయకులు

లోకేశ్వరం: ముథోల్ ఎమ్మెల్యేగా బీజేపీ అభ్యర్థి రామారావ్‌పటేల్‌ను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలంలోని వాస్తాపూర్, జోహర్‌పూర్, పంచగుడి, బామ్ని(కే) గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆదివారం రాత్రి వాస్తాపూర్, జోహర్‌పూర్ గ్రామాల్లో రామారావు పటేల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పిప్రిలో మంజూరు చేసిన ఎత్తిపోతల పథకం పూర్తి కాలేదని.. అర్లి వంతెన పనులను ప్రారంభించలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో లోకేశ్వరం ఎంపీటీసీ సభ్యుడు జయసాగర్, భోజన్న, రాజశేఖర్, సాయన్న, భాస్కర్, నారాయణ్, లింగారెడ్డి ఉన్నారు.

ప్రమాదం జరిగేదాకా చూస్తారా?



భైంసారూరల్: మండలంలోని పాంగ్రి నుంచి చుచుంద్ గ్రామాల మధ్య చేన్లలో విద్యుత్ సరఫరా అయ్యే స్తంభాలు ఒకవైపు వంగి ప్రమాదకరంగా మారాయి. మూడు స్తంభాలు గాలులు వీస్తే పడిపోయేలా ఉన్నా యి. ప్రమాదం జరగకముందే వి ద్యుత్ అధికారులు స్తంభాలను సరి చేయాలని రైతులు కోరుతున్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి


పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఈఓ గణేశ్

నర్సాపూర్(జి): మండలంలోని అంజనీతండా శివారులో సాగు చేసిన పత్తి పంటలను సోమవారం ఏఈఓ గణేశ్ పరిశీలించారు. పత్తి రైతులు అప్రమత్తంగా ఉండాలని.. పంటకు పొగాకు లద్దె పురుగు సోకిందన్నారు. ఆకులను తిని జల్లెడ మాదిరిగా చేసే ఈ పురుగు నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 ఎంఎల్ లేదా క్వినల్ఫాస్ 2 ఎంఎల్ లేదా థాయోడికార్బ్ 1.5 గ్రామ్ లేదా ఇమమేక్టిన్ బెంజోయట్ 0.5 గ్రాములను లీటర్ నీటికి కలిపి పంటపై పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. వినోద్ రెడ్డి, కండెల సత్యం ఉన్నారు.

దళారులకు విక్రయించొద్దు


నందన్‌లో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రైతులు


పెంచికల్‌పాడ్‌లో ప్రారంభిస్తున్న ఏఈఓ గణేశ్

నర్సాపూర్(జి): రైతులు తమ పంటను దళారులకు విక్రయించి.. మోసపోవద్దని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని నందన్, గొల్లమాడ గ్రామాల్లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే పంట అమ్ముకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు సర్వాడే ప్రవీణ్ పాటిల్, గోస్కుల భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామంలో సోమవారం డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఈవో గణేశ్ ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకుడు గంగారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

‘కార్మికులను మోసం చేస్తున్న ప్రభుత్వం’


మాట్లాడుతున్న సురేశ్

ఖానాపూర్: రెండేళ్లుగా వేతనాలు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులను మోసం చేస్తోందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ అన్నారు. సోమవారం పట్టణంలో మధ్యాహ్న భోజన కార్మికులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని పాఠశాలల్లో కార్మికులు అప్పులు చేసి భోజనం వండిపెడితే ఇప్పటికీ బిల్లులు చెల్లించలేదని వాపోయారు. పెరిగిన ధరలకు అనుగుణంగా చార్జీలు పెంచాలన్నారు. మధ్యాహ్న భోజన పథకంతోపాటు అల్పాహార పథకాలకు ప్రభుత్వం బడ్జెట్ కేటాయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు రాధ, లక్ష్మి, విజయ, బీంబాయి, జంగుబాయి, మమత తదితరులు ఉన్నారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా

- ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్


రేవోజీపేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న జాన్సన్

దస్తురాబాద్: ఒకసారి అవకాశం ఇచ్చి ఆశీర్వదిస్తే.. అభివృద్ధి చేసి చూపుతానని ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని ఆకొండపేట, దేవునిగూడెం, దస్తురాబాద్, భూత్కూర్, రాంపూర్, రేవోజీపేట, చెన్నూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలు పరిష్కరిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సింగరి కిషన్, పీఏసీఎస్ చైర్మన్ రామడుగు శైలజ, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఐలయ్యయాదవ్, రాజనర్సయ్య, రమేశ్‌రావ్, శ్రీనివాస్, శివయ్య, గోపి, సుధాకర్, శరత్‌రెడ్డి, రాజు, మాణిక్యరావ్, రాజలింగం తదితరులున్నారు.

పెంబి: ఖానాపూర్ ఎమ్మెల్యేగా జాన్సన్‌నాయక్‌ను గెలిపించాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని లోతర్యతండాలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం


బాసరలో ప్రచారం చేస్తున్న రమాదేవి, నేతలు


కుభీర్: దొడర్నాతండాలో నాయకుల ప్రచారం

భైంసా: కారు గుర్తుకు ఓటేసి ముథోల్ ఎమ్మెల్యేగా విఠల్‌రెడ్డిని గెలిపించాలని బీఆర్ఎస్ నాయకురాలు రమాదేవి పేర్కొన్నారు. సోమవారం బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో పూజల అనంతరం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను చూసి బీఆర్ఎస్‌ను ఆదరించాలని ఓట్లను అభ్యర్థించారు.

భైంసారూరల్: ముథోల్ ఎమ్మెల్యేగా విఠల్‌రెడ్డిని గెలిపించాలని మండలంలోని కోతల్‌గాంలో మాజీ జెడ్పీటీసీ సూర్యకాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. రవి, పోతన్న, రాందాస్, సచిన్ తదితరులు ఉన్నారు.

కుంటాల: మండలంలోని అంబుగామలో ఎమ్మెల్యేగా విఠల్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ మండల కన్వీనర్ పడకంటి దత్తాద్రి, జెడ్పీటీసీ కొత్తపల్లి గంగామణి , ప్యాక్స్ చైర్మన్ గజ్జారాం, సర్పంచ్ బాపూరావు, శంకర్‌గౌడ్, సవ్వి అశోక్‌రెడ్డి, రమణగౌడ్, హైమద్ పాషా, రాజు తదితరులున్నారు.

లోకేశ్వరం: ముథోల్ ఎమ్మెల్యేగా విఠల్‌రెడ్డిని గెలిపించాలని జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు భుజంగ్‌రావు, సంగెం నర్సయ్య, కపిల్, భోజన్న, సుదర్శన్‌రెడ్డి, బండి ప్రశాంత్, నారాయణ్‌రెడ్డి, ఎల్లన్న, శైలజ, సుధీర్‌రెడ్డి, గంగారావు, సాయన్న, సాయారెడ్డి, అనిల్ ఉన్నారు.

తానూరు: మండలంలోని మొగ్లి, మసల్గా, మసల్గా తండా గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. విఠల్‌రెడ్డి చేసిన అభివృద్ధిని చూసి మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించాలని మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, నాయకులు ఓటర్లను అభ్యర్థించారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోతారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు గోవింద్‌రావ్ పటేల్, పవార్ భీమ్, సర్పంచ్‌లు పుండలిక్, అబ్దుల్ గన్నీ, ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

కుభీర్: ముథోల్ ఎమ్మెల్యేగా విఠల్‌రెడ్డిని గెలిపించాలని మండలంలోని దొడర్నా, దొడర్నాతండా, రాంనాయక్, కిషన్‌నాయక్‌తండా, దావుజీ నాయక్ తండా, మల్లేశ్వర తండాల్లో సోమవారం బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తూము రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ చవాన్ శంఖర్, మండలాధ్యక్షులు అనిల్, సర్పంచులు బాలాజీ, శంకర్, లక్ష్మణ్, విజయ్, నాయకులు కె.సాయినాథ్, అహ్మద్‌హుస్సేన్, రహూఫ్ తదితరులు ఉన్నారు.